క్లుప్తంగా

వైద్యులు అంకితభావంతో పనిచేయాలి

● ఎమ్మెల్యే కరణం

చీరాల రూరల్: వైద్యులు అంకిత భావంతో రోగులకు వైద్య సేవలందించాలని స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రికి అందరూ నిరుపేద ప్రజలు వైద్య సేవల నిమిత్తం వస్తుంటారని వారిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వారికి తక్షణమే వైద్య సేవలందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని ఆయన వైద్యులను ఆదేశించారు. అలానే ఆసుపత్రిలో అభివృద్ధి చేయాల్సిన పనులపై ఆయన వైద్యులతో చర్చించారు. అనంతరం ఆయన ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. మందులు కొరత తదితర సమస్యలపై సిబ్బంది పనితీరుపై ఆయన ఆసుపత్రి పర్యవేక్షకురాలిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ సుభాషిణీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ హైమా సుబ్బారావు, డాక్టర్ పోలవరపు వెంకటేశ్వర ప్రసాద్, కండ్లగుంట అంజమ్మ, చుక్క నాగలక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

చినగంజాం: ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక ఉంటుందని జిల్లా కబడ్డీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు బాలురు బరువు 70 కేజీలు, బాలికలు బరుకు 65 కేజీల్లోపు ఉండాలని, అలాగే 20 సంవత్సరాల్లోపు వారై ఉండాలన్నారు. ఫిబ్రవరి 2004 లోపు పుట్టిన వారై ఉండాలని తెలిపారు. ఎంపికైన జట్లు ఈనెల 20 తేదీ నుంచి 23వ తేదీ వరకు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని, క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు 83010 15775 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నీ ప్రారంభం

మేదరమెట్ల: మండలంలోని రావినూతల గ్రామంలో గల రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30 వ అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నారు. భ్రమర సంక్రాంతి కప్ 2024 పేరుతో నిర్వహించే ఈ పోటీలను మంగళవారం ఉదయం 9గంటలకు ప్రారంభం కానున్నాయి. మొదటి మ్యాచ్ ఉదయం 9.30 జీడీసీఏ లెవెన్ గుంటూరు, చిక్కోలి చీతాస్ వైజాగ్ టీమ్‌ల మధ్యన, మధ్యాహ్నం ఒంటి గంటకు ఏలూరి సాంబశివరావు లెవెన్ పర్చూరు, కోకా ఇఫ్రా హైదరాబాద్ జట్ల మధ్య పోటీలు జరుగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

బల్లికురవ: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 క్యాంపు మంగళవారం కొత్తూరు సచివాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు రమీజ్ అహమ్మద్, రవితేజ సోమవారం తెలిపారు. అన్నిరకాల వ్యాధులకు పరీక్షలతో మందులు పంపిణీ చేస్తామని, క్యాంపును గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు.

ఫైలేరియా కేసుల గుర్తింపు

చినగంజాం: చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మహాలక్ష్మి కాలనీలో ఫైలేరియా కేసులను గుర్తించినట్లు వైద్య ఆరోగ్య సిబ్బంది సోమవారం రక్త నమునాలు సేకరించారు. రక్త నమునాలను పరీక్షించిన అనంతరం కొత్త ఫైలేరియా కేసులను వీరు గుర్తించారు. ఫైలేరియా కొత్త కేసులను ఆరోగ్య కార్యకర్తలు దగ్గరలో ఉన్న ఆశాలకు తెలియజేయాలని వైద్యాధికారులు డాక్టర్ విజయ్‌బాస్కర్, డాక్టర్ పి. సాయిశ్రీ చరణ్ తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చిరంజీవి, ఎల్‌పీ శ్యాంసుందర్, ఏఎన్‌ఎమ్ స్టాలినీదేవి, రమాదేవి, మురళి, మహేష్, ఆశాలు పాల్గొన్నారు.

చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



దుస్తులు అందుకున్న విద్యార్థులతో సంఘం నాయకులు

వేటపాలెం: విద్యార్థులు చదువులతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాలని చీరాల రెడ్డి జనసేవా సంఘం గౌరవ సలహాదారులు బత్తుల బ్రహ్మారెడ్డి సూచించారు. మండల పరిధిలోని అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9,10 తరగతులు విద్యార్థులకు కోలాటం సమరూప దుస్తులను ఉచితంగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బొందరపాటి జయభారతరెడ్డి, కోశాధికారి వట్టిగుంట వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసరెడ్డి, అనూరాధ, అంజమ్మ, బాల సుబ్రహ్మణ్యం, కమురున్నీసా బేగం పాల్గొన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి సంబరాలు

● పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు
● నేటి నుంచి సెలవులు
● చిందులు వేసిన చిన్నారులు



మార్టూరులో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న బాలికలు



కొణిదెనలో గంగిరెద్దులు, హరిదాసులతో ఉపాధ్యాయులు

మార్టూరు/యద్దనపూడి/కారంచేడు/చినగంజాం: తెలుగు వారి అతిపెద్ద పండుగ సంక్రాంతి సంబరాలు ముందే వచ్చాయి. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. మన తెలుగు సంప్రదాయ పద్ధతిలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగల గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. అంతేకాదు గంగిరెద్దులు, భోగి మంటలు, రంగవల్లులు, హరిదాసులు, కోలాటం, పిండివంటలు చేసి సందడి చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రం మార్టూరు, వలపర్ల గ్రామాల్లో సోమవారం ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్టూరు చైతన్య విద్యా సంస్థల్లో బాలికలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు ఆటల పోటీలు, కోలాటం ప్రదర్శించారు. వలపర్ల నేతాజీ విద్యాసంస్థల్లో బాలికలు లక్ష్మీదేవి, గోదాదేవి అలంకరణల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

➤ కారంచేడు మండలం కుంకలమర్రు మొయిన్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పావులూరి శ్రీనివాసరావు విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

➤ చినగంజాం మండలంలోని మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. రంగువల్లులు, సంప్రదాయ కోలాటాలు, భోగిమంటలు, గాలిపటాలు, గంగిరెద్దులు, హరిదాసు కీర్తనలు చేస్తూ చూసే వారికి కనివిందు చేశాయి. విజేతలకు గ్రామ సర్పంచ్ నల్లమోపు పద్మావతి పాఠశాల హెచ్‌ఎం ఎమ్. మల్లారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

➤ యద్దనపూడి మండలం యనమదల యూపీ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, సుధారాణి, లీలారాణి, రత్నకుమారి, కొర్రపాటి రాణి, ప్రత్యూష, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు.. రంగవల్లులు..

బల్లికురవ: సంక్రాంతి పర్వదినం సందర్భంగా పాఠశాలల్లో ముందస్తు వేడుకలు, పోటీలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బల్లికురవ ఉన్నత పాఠశాలలో మ్యూజికల్ చైర్స్, ముగ్గులు, గాలి పటాలు, వాలీబాల్, షార్ట్ పుట్, షటిల్ పోటీలను జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వేర్వేరుగా నిర్వహించారు. విజేతలకు జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందిస్తామని పాఠశాల హెచ్‌ఎం కె. హనుమంతరావు తెలిపారు. కొణిదెన గ్రామంలోని యజ్ఞనారాయణ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, చైర్మన్‌లు ఎస్ శ్రీనివాసులు, టీ రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మున్నంవారిపాలెంలో హరిదాసుల వేషధారణలో చిన్నారులు



యనమదల యూపీ పాఠశాలలో థింసా నృత్యం చేస్తున్న విద్యార్థులు



కుంకలమర్రులో ముగ్గుల పోటీల్లో చిన్నారులు

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు



పార్టీలో చేరిన వారితో నియోజకవర్గ సమన్వయకర్త హనిమిరెడ్డి

● పార్టీలోకి ఆహ్వానించిన హనిమిరెడ్డి

బల్లికురవ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలోకి చేరేందుకు గ్రామాల వారీగా క్యూ కడుతున్నారని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని పాత మల్లాయపాలెం గ్రామంలో సర్పంచ్ జూపల్లి రాఘవరావు పార్టీ గ్రామ నాయకుడు ముద్దపాటి చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో 15 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరందరికి హనిమిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా స్వాగతం పలికారు. భవిష్యత్ వైఎస్సార్ సీపీదేనని సీఎం జగన్ అధికారాన్ని చేపట్టడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పించటంతోపాటు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ప్రకటించారు. పార్టీలో చేరిన వారిలో జూపల్లి శ్రీను, కృష్ణ, నాగేశ్వరరావు, సారెద్దు హనుమయ్య, వెంకటస్వామి, వెంకయ్య, రమణారావు, శింగయ్య ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, పార్టీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసారెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ నూతన పాస్టర్ల సంఘం ఎన్నిక



ఎన్నికైన నియోజకవర్గ నూతన పాస్టర్ల కమిటీ

అద్దంకి: నియోజకవర్గంలోని ఐదు మండలాలు, పట్టణంలోని చర్చీల పాస్టర్లు కలిసి నియోజకవర్గ పాస్టర్ల నూతన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశం సోమవారం అద్దంకి పట్టణంలో నిర్వహించారు. నూతన కమిటీ ఫెలోషిప్ ప్రెసిడెంట్‌గా నాగుబాబు దయానందం, సెక్రటరీగా తంగిరాల తిమోతి, ట్రెజరర్‌గా పాలపర్తి దానియేలు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జీవన్ బుల్లార్డును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ వైస్‌ప్రెసిడెంట్‌లుగా ఎన్ రవిశంకర్, ఇటికాల యోహాన్, జీ క్రిష్టఫర్, జాయింట్ సెక్రటరీలుగాకు సువర్ణరాజు, పీ లాజరు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఏ దాసుబాబు, జీ సురేశ్, కే శ్యామ్‌బాబు, పీ ఉదయ్‌కుమార్, ఎస్ రామారావు, ఎం సుబ్బారావు, వీ నాగప్రసాద్, ఎం పౌలు, కే రామారావు, ప్రసన్నబాబు, ఎం సైమన్, కే ప్రభుదాసు, టీ అబ్రహాం గిరిని ఎన్నుకున్నారు.

విద్యార్థులకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న ప్రెసిండెంట్, సిబ్బంది

చినగంజాం: తైక్వాండోలో పతకాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఇటీవల ప్రకాశం జిల్లా మార్కాపురంలోని రాక్‌వెల్ పబ్లిక్‌స్కూల్‌లో 37 తైక్వాండో చాపింయన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో సత్యం స్కూల్ విద్యార్థులు పథకాలు సాధించారు. తైక్వాండో పోటీలు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, బాయ్స్ అండ్ గరల్స్‌కు జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పతకాలు సాధించారు. ఈసందర్భంగా సోమవారం స్కూల్ ఆవరణలో పాఠశాల కరస్పాడెంట్ సున్నా హరినాథ్ గెలుపొందిన క్రీడాకారులను కోచ్ సుబ్రమణ్యంలను అభినందించారు. ఏపీ తైక్వాండో స్టేట్ వైస్ ప్రెసిండెంట్ ఎస్. అబ్దుల్‌సలాం, జననీ, సిద్ధశ్రీ, యామిని, కేదారలక్ష్మి, అవిత్, పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

పర్చూరు(చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ ఆధ్వర్యంలో నిరాశ్రయులైన నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. చలిగాలులు ఎక్కువగా ఉన్నందువల్ల దోమల నుంచి రక్షణ పొందుటకు పర్చూరు బస్‌స్టాండ్ ఆవరణలో, రోడ్డుకు ఇరువైపులా ఇతర ప్రదేశాల్లో నిద్రించే వ్యక్తులను గుర్తించి మెత్తం 35 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి వారికి మౌలిక అవసరాలు తీర్చేందుకు రోటరీ క్లబ్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పి. సదానందరెడ్డి, సభ్యులు ఎన్ .సుబ్బారావు, పి. ఉదయ్‌భాస్కర్, కోటా శ్రీనివాసరావు, గొట్టిపాటి శ్రీనివాసరావు, తోకల కృష్ణమోహన్, కోమటి ఆంజనేయులు, కారుమూడి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆంగ్ల భాషలో నైపుణ్యం తప్పనిసరి

పర్చూరు (యద్దనపూడి): విద్యార్థులు ప్రపంచ స్థాయి ప్రమాణాలను సాధించాలంటే ఆంగ్ల భాష నైపుణ్యం తప్పనిసరని పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు రత్నబాబు అన్నారు. సోమవారం మండలంలోని పర్చూరులోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ నందు స్పెల్‌బీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. మాతృ భాషకు సముచిత ప్రాధాన్యత ఇస్తూనే ఆంగ్లవిద్యను కూడా నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందని తద్వారా మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చన్నారు. నాలుగు కేటగిరిల్లో నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.1500, ద్వితీయ బహుమతి రూ.1000, తృతీయ బహుమతి రూ.500 అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ లక్ష్మయ్య, అకడమిక్ డైరెక్టర్ సుబ్బరామిరెడ్డి, ప్రిన్సిపాల్ షాఫియాబేగం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కారు బోల్తా, దంపతులకు తీవ్రగాయాలు



తిరగబడిన కారు, పక్కనే గాయపడిన వరలక్ష్మి

వేటపాలెం: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కారు బోల్తా పడటంతో భార్యా, భర్తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన జాతీయ రహదారి బైపాస్ రోడ్డు పందిళ్లపల్లి పెట్రోల్ బంక్ దగ్గరలో సోమవారం జరిగింది. మండల పరిధిలోని కొత్తపేటకు చెందిన భార్యాభర్తలు పోలిశెట్టి రాంబాబు, వరలక్ష్మి పని నిమిత్తం బెంగళూరు వెళ్లి తిరిగి కారులో కొత్తపేటకు వస్తున్నారు. ఉదయాన్నే డ్రైవర్ నిద్రమత్తులో వేగంగా కారు నడుపుతూ సడన్‌గా బ్రేకులు వేయడంతో రోడ్డుపై కారు బోల్తా కొట్టింది. దీంతో దంపతులిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108కి ఫోన్ చేయగా గాయపడిన వారిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

జగనన్న కాలనీల్లో వసతుల కల్పనకు కృషి

● ముఖద్వార పనులను ప్రారంభించిన హనిమిరెడ్డి



ముఖద్వార పనులను ప్రారంభిస్తున్న హనిమిరెడ్డి

అద్దంకి: నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో త్వరలోనే అన్ని వసతులను కల్పిస్తామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి అన్నారు. ఆయన సోమవారం పట్టణ సమీపంలోని వేలమూరిపాడు సమీపంలోని జగనన్న కాలనీలో ముఖద్వార పనులను టెంకాయకొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ లబ్ధిదారుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీని నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో లబ్ధిదారులు శరవేగంగా నిర్మాణాలు చేసుకుంటున్నారని, పనులు బాగా జరుగుతున్నాయన్నారు. చిన్న చిన్న సమస్యలు తొందరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ఇక్కడ ఇళ్లు కట్టుకునే వారంతా సంతోషంగా ఉండే విధంగా కాలనీలో సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. పేదలంతా సీఎం జగన్‌కు రుణపడి ఉన్నారన్నారు, గతంలో ఏ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున ఇంటి స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. మనకు మేలు చేసిన వారిన మరచిపోవద్దని చెప్పారు. కార్యక్రమంలో చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ, కమిషనర్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ దేశు పద్మేశ్, కే అనంతలక్ష్మి, జువ్వి రాము, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు వాహన పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కరణం

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● ఎమ్మెల్యే కరణం బలరాం



కల్వర్టు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. సోమవారం ఆయన చీరాల పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. పట్టణంలోని 31వ వార్డులో చిన్నపిల్లల పార్కు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు సల్లూరి అనిల్, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి కోలా శివ తదితరులు ఉన్నారు. అలానే చీరాల మసీదు సెంటర్‌లో జరుగుతున్న డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. డ్రైనేజిపై నిర్మిస్తున్న కల్వర్టు, అనుబంధంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలానే మండలంలోని జాండ్రపేట పరిధిలో దేవాంగ భవనం స్థలాన్ని పరిశీలించి అక్కడి వారితో మాట్లాడారు.

పంట పొలాలకు నీరందించండి...

చీరాల మండలం తోటవారిపాలెం పంపింగ్ స్కీం పరిధిలో ఉన్న పంట పొలాల కోసం నీరు, పదిరోజులు పాటు ఉచిత కరెంటు అందించాలని రైతులు ఎమ్మెల్యే కరణం కలిసి మాట్లాడారు. పొలాలకు నీరందిస్తే ఎంతో మేలు జరుగుతుందని రైతులు వాపోయారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడారు. పొలాలకు నీరు, పదిరోజులు పాటు ఉచిత కరెంటు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వర్లు, గవిని సాంబు, రామకృష్ణ, సాయిల వాసు, బుజ్జి, రైతులు పాల్గొన్నారు. పట్టణ పరిధిలో స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్పొరేషన్ సహకారంతో మంజూరు చేసిన ఎన్ఎస్‌కెఎఫ్‌డీసీ పథకం కింద మంజూరైన మూడు సెప్టిక్ ట్యాంక్ వాహనాలను సోమవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి.సరోజిని, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి అర్జున్ నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. జాండ్రపేట పరిధిలో నిత్యావసర సరుకుల పంపిణీ వాహనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

వేటపాలెం: ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఫించస్ రూ. 3 వేలకు పెంచి అందించిన ఏకైక నాయకుడు దేశ చరిత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరే అని పింఛనుదారులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ సచివాలయం–4 పరిధిలోని విజయనగర్ కాలనీలో సామాజిక పింఛను పెంచిన సందర్భంగా జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ సీఎం జగన్‌కి తాము ఎప్పుడు రుణపడి ఉంటామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన నాయకుడు దేశచరిత్రలో జగన్ ఒక్కరే అని గుర్తుంచు కోవాలని తెలిపారు. రాబోయే ఎన్నికలో తిరిగి జగన్‌ను ముఖ్యమంత్రిని చేస్తామన్నారు. పేద,బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉంటూ వారి క్షేమం కోసం మే పాలన సాగిస్తున్న నాయకుడు జగన్ అన్నారు. కార్యక్రమంలో వలంటీర్ డీ లోకేష్, గృహసారథులు, జీ రాజు, ఎస్ సువార్త పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళులు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైస్ చైర్మన్

మార్టూరు: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తుగల సామాజిక న్యాయ విగ్రహ విష్కరణ సందర్భంగా ప్రకాశం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ ఆధ్వర్యంలో సోమవారం మార్టూరులో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పంచాయితీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి అధికారులు, నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీ నితిన్, పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ భుక్యా సునీతాబాయి, రాజానాయక్, బాబూనాయక్, గర్నెపూడి సుంధరావు, రవిచంద్, గడ్డం మస్తాన్‌వలీలు పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులకు ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న హెచ్‌ఎం సాల్మన్‌రాజు

చీరాల అర్బన్: వినోదంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ముగ్గులు పోటీలు దోహదపడతాయని పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.సాల్మన్‌రాజు అన్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులకు సైన్సులో ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో మానవ శరీరభాగాలు, సైన్సు ప్రయోగాలు, పర్యావరణ స్పృహను కలిగించే ముగ్గులను విద్యార్థులు ఎంతో చక్కగా తీర్చిదిద్ది ఆలోచన రేకెత్తించారు. అనంతరం పోటీల్లో విజేతలకు జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి అందించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కె.రాజేంద్రప్రసాద్, వై.గాం . డీ, యల్లమందేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.